సాక్షి ఆదిలాబాద్
ఆదివారం । 19 । మార్చి । 2023



కీచక గురువు..!

జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్‌బోర్డులో గల ఓ పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఓ గురువు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు విద్యార్థినులు ఆరోపిస్తున్నారు.

8లో▸



అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

అంతర్రాష్ట్ర దొంగల ముఠా పట్టుబడింది. ఇటీవల ఇచ్చోడ మండలంలో డ్రైవర్‌ను కత్తితో పొడిచి కంటైనర్‌ను, అందులోని సామగ్రిని దోపిడీ చేసిన విషయం తెలిసిందే.

10లో▸

గరిష్టం/కనిష్టం
28.0/19.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో పలుచోట్ల ఓ మోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో తొమ్మిది కేసులు పరిష్కారం



కేసు పరిష్కరిస్తున్న క్షమాదేశ్ పాండే

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో శనివారం బ్యాంక్ లోక్‌అదాలత్ నిర్వహించారు. కక్షిదారులు రాజీమార్గం ద్వారా తొమ్మిది కేసులు పరిష్కరించుకున్నారు. సంబంధిత బ్యాంకులకు రూ.6లక్షల 39వేల 800 రికవరీ అయ్యాయి. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ మాదవీకృష్ణ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను విధుల నుంచి తొలగించాలి

ఆదిలాబాద్‌అర్బన్: ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనకు సంబంధించి టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డిని వెంటనే విధుల నుంచి తొలగించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ ద్వారా నిర్వహించిన పరీక్షల్లో పారదర్శకత లోపించిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రశ్నపత్రాలు లీకేజీ అవుతున్నాయని పేర్కొన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలన్నారు. అలాగే పూర్తి విచారణ జరిపించి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యకర్తలు అజయ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తూ..

తాంసి: వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌చారి డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ నటరాజ్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అలాగే కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందులో అరుణ్‌కుమార్, రమేశ్ తదితరులున్నారు.

గిరిజన గ్రామాల్లో వృత్తి శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలి



సమావేశంలో పాల్గొన్న డీఈవో తదితరులు

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లాలోని గిరిజన గ్రామాల్లో మహిళలకు జనశిక్షణ సంస్థ ద్వారా మరిన్ని వృత్తి శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని డీఈవో ప్రణీత, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్ రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని జన శిక్షణ సంస్థ కార్యాలయ ఆవరణలో బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జన శిక్షణ సంస్థలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బ్యాంకుల ద్వారా రుణం తీసుకునే సదుపాయం ఉంటుందన్నారు.శిక్షణ పూర్తి చేసుకొని సర్టిఫికెట్ పొందిన వారు నిబంధనలకు లోబడి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్, సంస్థ డైరెక్టర్ ఏం శ్యామల, చైర్మన్ రమేశ్, ఐటీఐ ప్రిన్సిపాల్ సుజాత, సెట్విన్ డైరెక్టర్ సురేందర్, సంస్థ ప్రోగ్రాం అధికారి రాజన్న పాల్గొన్నారు.

24 గంటలు అందుబాటులో గ్రంథాలయం

ఆదిలాబాద్‌రూరల్: కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాల మేరకు నేటి నుంచి బీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లోని లైబ్రరీ, స్టడీ హాల్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. స్టడీసర్కిల్‌లో అన్నిరకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొలిటికల్ హీట్



భట్టి పాదయాత్రలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ టికెట్ ఆశావహులు

గత సెప్టెంబర్‌లో జైనథ్ మండలం దీపాయిగూడకు వచ్చిన కేటీఆర్‌తో జిల్లా నేతలు (ఫైల్)

ఇటీవల జిల్లాకేంద్రానికి వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జిల్లా నేతలు (ఫైల్)

- జిల్లాలో వేడెక్కుతున్న రాజకీయాలు
- రాష్ట్ర నేతల పర్యటనల ప్రభావం
- అన్ని రాజకీయ పార్టీల్లో సందడి
- నియోజకవర్గాల్లో తెరపైకి ఆశావహులు

జిల్లాలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. సాధారణ ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చనే భావనతో నియోజకవర్గాల్లో ఆయా పార్టీల నుంచి టికెట్ ఆశిస్తున్న పలువురు తెరపైకి వస్తున్నారు. మరో పక్క రాష్ట్ర నేతల పర్యటనలు, పాదయాత్రలతో సందడి నెలకొంది. గ్రామ గ్రామాన తిరిగి ప్రజలను కలుసుకోవడం ద్వారా రాబోయే ఎన్నికల్లో ప్రయోజనం పొందాలని ఆయా పార్టీలు ప్రజాబాట పట్టాయి. – సాక్షి,ఆదిలాబాద్

☞ బీఆర్‌ఎస్‌లో..

ఇటీవల హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశమై రాబోయే ఎన్నికలకు సన్నద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల్లో పాదయాత్రలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఇప్పటివరకు తమ యాత్రలకు సంబంధించి ఎలాంటి షెడ్యూల్ ఇంకా ఖరారు చేసుకోలేదు. అయితే సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేయడంపై ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావు, ఇటు ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల పరంగా జిల్లా పరిధిలోకి వచ్చే మండలాల్లో ఆయా ఎమ్మెల్యేలు రేఖానాయక్, ఆత్రం సక్కు ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. ఈమేరకు ప్రజలను కలుస్తూ వారిని ప్రసన్నం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. ఇదిలా ఉంటే బోథ్ నియోజకవర్గంలో మాజీ మంత్రి గొడం నగేశ్ టికెట్‌ను ఆశిస్తున్నారు. ఆయన తన అనుచరుల ద్వారా గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఖానాపూర్ నియోజకవర్గం నుంచి ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ టికెట్‌ను ఆశిస్తున్నారు. ఆయన కూడా ప్రస్తుతం జిల్లా పరిధిలోకి వచ్చే మండలాల్లోనే తిరుగుతున్నప్పటికీ అడపదడపా అవకాశం దొరికినప్పుడు నియోజకవర్గంలోని ఇతర మండలాల్లోనూ చుట్టివస్తున్నారు. ఆసిఫాబాద్ నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి నియోజకవర్గ టికెట్ ఆశిస్తున్నారు. ఆమె కూడా జిల్లాలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తన ఉనికి చాటుకుంటున్నారు. మొత్తంగా ఇన్నిరోజుల పాటు స్తబ్దుగా ఉన్న రాజకీయాలను తెరపైకి తెస్తున్నారు.

☞ 'కమలం'లో ఉత్తేజం..

బీజేపీలో ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పర్యటన శ్రేణుల్లో ఉత్తేజం నింపింది. ఈ పార్టీలో ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ సుహాసినిరెడ్డి, నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. ఎవరికి వారే పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల సుహాసినిరెడ్డి బర్త్‌డేను పెద్ద ఎత్తున జరుపుకోవడం, దానికి జిల్లాలోని నాయకులందరిని పిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. బోథ్ నియోజకవర్గంలో ఈ పార్టీ రాజకీయ పరిస్థితులు ఆసక్తికరంగా ఉన్నాయి. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు ఈ నియోజకవర్గం నుంచి బరిలో ఉండవచ్చనే ప్రచారం ఉంది. ఒకవేళ తనకు కాకపోతే తనయుడు సోయం వెంకటేశ్‌నైనా ఇక్కడినుంచి నిలపవచ్చుననే ప్రచారం కూడా లేకపోలేదు. ఇక ఆడె మానాజీ, సాకటి దశరథ్, లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ బలిరాం టికెట్‌ను ఆశిస్తున్నారు. నాయకులు ఎవరికి వారే పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం ఆసక్తి కలిగిస్తుంది.

☞ 'హస్తం' పార్టీలో ఇలా..

హస్తం పార్టీలో గ్రూపు తగాదాలు ఎక్కువగా ఉన్నాయి. నియోజకవర్గాల్లో టికెట్ ఆశిస్తున్న నేతలు తెరపైకి వస్తున్నారు. బోథ్ నియోజకవర్గంలో సీఎల్‌పీ నేత మల్లుభట్టి విక్రమార్క పాదయాత్ర జిల్లా శ్రేణులకు నూతనోత్తేజం కలిగిస్తుంది. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత టికెట్‌ను ఆశిస్తున్నారు. తలమడుగు జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి ఈ నియోజకవర్గం నుంచి బరిలో నిలవాలని ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం లేకపోలేదు. బోథ్ నియోజకవర్గం నుంచి ప్రేమ్‌సాగర్‌రావు అనుచరుడిగా డాక్టర్ వెన్నెల అశోక్ టికెట్‌ను ఆశిస్తున్నారు. తాజాగా జరుగుతున్న పాదయాత్రలో ఆయన భట్టి వెంట విస్తృతంగా పాల్గొంటున్నారు. అదేవిధంగా ఆడె గజానంద్ కూడా పార్టీ టికెట్ ఆశిస్తూ ఈ పాదయాత్రలో విస్తృతంగా తిరుగుతున్నారు. ఇక సీనియర్ నాయకులు నరేశ్ జాదవ్ కూడా ఈ నియోజకవర్గం నుంచి పార్టీ పరంగా టికెట్ ఆశిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ పార్టీలో టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు తెరపైకి వచ్చే అవకాశం కనిపిస్తుంది.

ఒంటికి..రెంటికీ తిప్పలే!



ఇది ఇచ్చోడ మండల కేంద్రం. వివిధ పనుల నిమిత్తం ఇక్కడకు వచ్చే ప్రజలతో నిత్యం సందడిగా ఉంటుంది. ముఖ్యంగా వారసంత జరిగే సోమవారం రద్దీ అధికం. సామూహిక మరుగుదొడ్లు లేక ప్రజలు తిప్పలు తప్పట్లేదు. ఇదొక్కటే కాదు.. జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితే.

- జిల్లాలో కానరాని కమ్యూనిటీ మరుగుదొడ్లు
- ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- చొరవ చూపని అధికారులు
- ప్రజలకు తప్పని అవస్థలు

కైలాస్‌నగర్: జిల్లాలోని ప్రధాన మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో కమ్యూనిటీ టాయ్‌లెట్స్ నిర్మాణం కలగానే మారుతోంది. ఏటా ప్రతిపాదనలు సిద్ధం చేసి డీఆర్డీవో కార్యాలయానికి పంపుతున్నా కార్యరూపం మాత్రం దాల్చడం లేదు. దీంతో ఆయా ప్రాంతాలకు పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ఒంటికి, రెంటికి తిప్పలు తప్పని పరిస్థితి. ముఖ్యంగా వారసంత జరిగే రోజుల్లోనైతే పరిస్థితి దారుణం. మహిళల అవస్థలు వర్ణనాతీతం. సమావేశాల్లో కమ్యూనిటీ టాయ్‌లెట్స్ అవశ్యకతపై పదేపదే చర్చిస్తున్నా పాలకులు వాటి నిర్మాణాలపై మాత్రం దృష్టిసారించడం లేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి.

కార్యరూపం దాల్చని వైనం..

స్వచ్ఛభారత్ మిషన్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయి. ఇంటింటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించాలనే ఉద్దేశంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.12వేల ఆర్థికసాయం సైతం అందజేస్తోంది. అదే సమయంలో కమ్యూనిటీ టాయ్‌లెట్స్ అవసరమున్న చోట్ల పంచాయతీల భాగస్వామ్యంతో ప్రజల అవసరాలకనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించింది. అయితే జిల్లాలో ఇప్పటి వరకు వీటిపై యంత్రాంగం అంతగా దృష్టి సారించిన పరిస్థితి కన్పించడం లేదు. జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరిగిన ప్రతీసారి అధికారులు, జెడ్పీటీసీలు కమ్యూనిటీ టాయ్‌లెట్స్ అవశ్యకతపై చర్చిస్తారు. వాటిని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తారు. అయితే మూడేళ్లుగా చర్చలు, ఆదేశాలకే పరిమితమయ్యాయి తప్ప ఇప్పటి వరకు ఏ ఒక్క చోట కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం.

తప్పని ఇక్కట్లు..

జిల్లాలోని ఇచ్చోడ, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, నేరడిగొండ, బేల మండల కేంద్రాలతో పాటు ఉట్నూర్ డివిజన్ కేంద్రం నిత్యం ప్రజలతో సందడిగా ఉంటాయి. ఆయా మండలాల్లోని ప్రజలు వ్యాపార, వాణిజ్య, బ్యాంకింగ్‌తో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి కోసం ఇక్కడికి రావాల్సి ఉంటుంది. ప్రభుత్వ కార్యాలయాలు సైతం ఇక్కడే ఉండటంతో రద్దీగా కనిపిస్తుంటాయి. ముఖ్యంగా వారసంతలు జరిగే రోజుల్లో ప్రజల రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి ప్రాంతాల్లో ప్రజల అవసరాలకనుగుణంగా మరుగుదొడ్లు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పురుషులు ఎక్కడో ఓ చోట కానిచ్చేస్తున్నప్పటికీ మహిళలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు.

డీడీలు వెనక్కి ఇచ్చేశారు.

స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా కమ్యూనిటీ టాయ్‌లెట్స్ నిర్మాణల కోసం గుడిహత్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ అధికారులు 2020–21 ఏడాదికి గాను రూ.20వేల చొప్పున డీడీలు తీసి జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులకు పంపించారు. రూ.2లక్షల వ్యయంతో ఆయా పంచాయతీల్లో వాటిని ఈజీఎస్ ద్వారా నిర్మించాల్సి ఉంది. అయితే సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా వాటి నిర్మాణాల స్కీం గడువు ముగియడంతో చేసేదిలేక ఆ డీడీలను గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తిరిగి పంచాయతీలకు పంపి బాధ్యతారహిత్యాన్ని చాటుకున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

రెండు వేలకు మించి జనాభా కలిగిన పంచాయతీల్లో ఈజీఎస్ నిధులతో కమ్యూనిటీ టాయ్‌లెట్స్ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. జిల్లాలోని 61 గ్రామ పంచాయతీల్లో ఈ ఏడాది వాటి నిర్మాణాల కోసం కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఒక్కో కమ్యూనిటీ టాయ్‌లెట్స్ నిర్మాణానికి రూ.3లక్షల వ్యయం అవుతుండగా ఇందులో గ్రామ పంచాయతీలు తమ వాటాగా రూ.90వేలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి అనుమతులు లభించిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– పర్వాత్, ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి




మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్, చిత్రంలో ఎమ్మెల్యే రామన్న, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- కలెక్టర్ రాహుల్‌రాజ్

ఎదులాపురం: అన్ని వర్గాల వారు తమ పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే జోగు రామన్న, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డితో కలిసి పండుగల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, మతపెద్దలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రంజాన్, శ్రీరామనవమి పండుగల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ పండుగలను అందరూ సంప్రదాయబద్ధంగా, సమన్వయంతో జరుపుకోవాలన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మత పెద్దలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రిజ్వాన్ బాషా షేక్, నటరాజ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ట్రెయినీ కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో రమేశ్ రాథోడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కృష్ణవేణి, పలువురు మతపెద్దలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వాన బీభత్సం



కోకస్‌మన్నూర్‌లో కురిసిన వడగళ్ల వాన



పొచ్చర సబ్‌స్టేషన్‌లో పడిపోయిన ఫీడర్లు

బోథ్: ఆదిలాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పలు చోట్ల వృక్షాలు పడిపోయాయి. కరెంట్ తీగలు రోడ్లపై పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బోథ్ మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న నేలకొరిగింది. పొచ్చర విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫీడర్లు పడిపోయాయి. నేరడిగొండ, బజార్‌హత్నూర్, ఇచ్చోడ మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు జైనథ్, బేల, తలమడుగు, తాంసీ, భీంపూర్ మండలాల్లో చిరుజల్లులు కురిశాయి.



కనుగుట్టలో నేలవాలిన మొక్కజొన్న

మిషన్ భగీరథ నీళ్లెక్కడ..?

- ట్యాంక్‌లకు రంగులేసి కనెక్షన్లు మరిచారు
- తాగునీరందక జనం ఇబ్బందులు పడుతున్నారు
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే తెలంగాణ అభివృద్ధి
- సీఎల్పీ నేత బట్టి విక్రమార్క
- జిల్లాలో మూడో రోజూ కొనసాగిన 'పీపుల్స్ మార్చ్'



వర్షంలోనూ కొనసాగుతున్న పాదయాత్రలో భట్టి విక్రమార్క, సాజిద్‌ఖాన్ తదితరులు



వర్షంలోనూ మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం పూర్తిగా నిర్వీర్యం అయిందని, ట్యాంక్‌లకు రంగులేసి కనెక్షన్ ఇవ్వడం మర్చిపోవడంతో తాగునీరందక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా చేపట్టిన పీపుల్స్‌మార్చ్ జిల్లాలో మూడో రోజు కొనసాగింది. శనివారం ఉదయం సిరికొండ మండలం కొండాపూర్ నుంచి ప్రారంభమైన యాత్ర ఇంద్రవెల్లి మండలంలోని దస్నాపూర్, పిట్టబొంగరం, కేస్లాపూర్, ముత్నూర్, ఏమాయికుంట, హీరాపూర్, ఇంద్రవెల్లి గ్రామాల గుండా సాగింది. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ భట్టి ముందుకు సాగారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. మండలంలోని దస్నాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని గ్రామస్తులు భట్టి దృష్టికి తీసుకొచ్చారు. కేస్లాపూర్‌లో ఆయన మహిళలతో మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ వచ్చిందా.. మిషన్ భగీరథ నీరు వస్తుందా... అని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి నాగోబా ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ఆదివాసీ పెద్దల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు డబుల్ బెడ్‌రూం మంజూరు కావడం లేదని, ఐటీడీఏ పేరుకే ఉందని, ఎలాంటి రాయితీ రుణాలు అందడం లేదని వారు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు ఆదివాసీలంటే చాలా ఇష్టమని, త్వరలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఆ వెంటనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పాదయాత్రలో ప్రజా యుద్ధనౌక గద్దర్ పాల్గొని సంఘీభావం తెలిపారు. అక్కడి నుంచి ముత్నూర్ చేరుకున్న పాదయాత్రలో ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అక్కడి నుంచి వర్షంలోనే పాదయాత్ర కొనసాగించారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుని నివాళులర్పించారు. అనంతరం మండలకేంద్రంలో వర్షంలోనే కార్నర్ సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఏఐసీసీ ప్రతినిధులు వినోద్‌నాయక్, వెడ్మ బొజ్జు, ఉట్నూర్ జెడ్పీటీసీ రాథోడ్ చారులత, ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు భరత్ చౌహాన్,పుర్కు బాపూరావ్, తిరుపతి తదితరులున్నారు.

'రాష్ట్ర మంత్రివర్గం రాజీనామా చేయాలి'



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు, నిరుద్యోగులు

ఆదిలాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రివర్గం రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై జిల్లా కేంద్రంలో శనివారం పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జిల్లా కేంద్రంలో ర్యాలీ చేపట్టి అనంతరం తెలంగాణ చౌక్ వద్ద ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. వెంటనే ఈ వ్యవహారంపై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి, నాయకులు రవి, దినేశ్ మటోలియా, ఆదినాథ్, ప్రవీణ్, వేణుగోపాల్, ప్రవీణ్ రెడ్డి, రాము, వేదవ్యాస్‌తదితరులు పాల్గొన్నారు.

బకాయిల వసూలు లక్ష్యం పూర్తి చేయాలి

ఎదులాపురం: స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ బకాయిల వసూలు లక్ష్యం ఈనెల 25 లోపు పూర్తి చేయాలని డీఆర్డీఏ ఏపీడీ అర్క చరణ్‌దాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ మొండి బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించి గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. సమావేశంలో బ్యాంక్ లింకేజ్ డీపీఎం శోభారాణి, ఫైనాన్స్ డీపీఎం నరేందర్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న డీఆర్డీఏ ఏపీడీ చరణ్‌దాస్

క్లుప్తంగా

కుక్కల స్వైర విహారం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలో శనివారం ఏఏ స్సై లక్ష్మణ్‌తోపాటు సుమారు 20 మందిని పిచ్చికుక్కలు కాటు వేయగా గాయపడ్డారు. మండలకేంద్రానికి చెందిన గాయక్‌వాడ్ నిర్గుణ, గౌతమి, లక్ష్మి, విక్రమ్, రాంజన్‌షేక్‌తో పాటు హాథ్ సే హాథ్ జోడోయాత్రలో పాల్గొనేందుకు ఇతర ప్రాంతాల నుంచి మండలకేంద్రానికి వచ్చిన వీరారెడ్డి, వినోద్, రామేశ్వర్, పరశురాం తోపాటు 20 మందిపైగా పిచ్చి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డ్రైవర్‌కు ఫిట్స్ రాగా అదుపుతప్పిన ట్రాక్టర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్‌కు ఫిట్స్ రాగా వాహనం అదుపుతప్పి ప్రమాదానికి కారణమైంది. వివరాలు... మున్సిపాలిటీలో డ్రైవర్‌గా పని చేస్తున్న సాయన్న శనివారం విధులు ముగించుకొని కార్యాలయానికి ట్రాక్టర్‌పై వెళ్తున్నాడు. పట్టణంలోని శ్రీకృష్ణ రెసిడెన్సీ సమీపానికి రాగానే అతడికి ఫిట్స్ రాగా కిందపడిపోయాడు. దీంతో అదుపు తప్పిన ట్రాక్టర్ పార్కింగ్ చేసిన వాహనాలపైకి దూసుకువెళ్లింది. దీంతో పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. అక్కడే ఉన్న వ్యాన్‌లోకి ఎక్కేందుకు సిద్ధంగా ఉన్న 14మంది ప్రయాణికులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌కు ఫోన్ చేసి డ్రైవర్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ కాలు పైనుంచి ట్రాక్టర్ వెళ్లగా కాలు విరిగింది. వెంటనే పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.







రిమ్స్ చుట్టూ తేనెతుట్టెలు

ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రి చుట్టూ తేనేతుట్టెలు విచ్చలవిడిగా ఉన్నాయి. ప్రధానంగా ఎక్కువగా జనాలు తిరిగే ఆపరేషన్ థియేటర్ రూమ్ పక్కన అధికంగా ఉన్నాయి. అటు పక్కనే రోగుల బంధువులు, ఆస్పత్రికి వచ్చిన వారి కుటుంబ సభ్యులు సేదతీరుతుంటారు. వీటిని చూసి భయాందోళనకు గురవుతున్నారు. అనుకోని ఘటన జరిగితే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఇకనైనా ఆస్పత్రి అధికారులు గమనించి వాటిని తొలగించాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఆగని విద్యార్థినుల అస్వస్థత

- ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన
- మెనూ పాటించడంలేదని ఆరోపణ
- ఘటనపై కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆరా
- గురుకులాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో
- వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన



ప్రిన్సిపాల్ ద్వారా వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో, ఆర్‌సీవో

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల (ఈఎంఆర్‌ఎస్) పాఠశాలలో శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతూ ఎనిమిది మంది విద్యార్థినులు అస్వస్థతకు గురి కాగా, మెరుగైన వైద్యం కోసం ఉట్నూర్ సీహెచ్‌సీకి తరలించిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం ఆరోతరగతికి చెందిన విద్యార్థిని చౌహాన్ అంక్షిక, ఎనిమిదో తరగతి విద్యార్థిని సుగుణాదేవి శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడడంతో వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి ఆక్సిజన్ అందించారు. పాఠశాలలో 349 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 279 మంది బాలురు, 70 మంది బాలికలున్నారు. విద్యార్థినులు మాత్రమే శ్వాస సమస్యతో అస్వస్థతకు గురి కావడంతో పాఠశాల సిబ్బంది, విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, వికారాబాద్, నిజామాబాద్ కొత్తగూడెం, వరంగల్ తదితర ప్రాంతాల విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ప్రతీరోజు ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థినులు శ్వాస సమస్యతో బాధపడుతూ ఆస్పత్రి పాలవుతున్నారు. ఇప్పటివరకు పాఠశాలను హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు మాత్రమే సందర్శించి ప్రథమ చికిత్స అందిస్తున్నారు. స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థినులు ఇబ్బంది పడడానికి గల కారణాలపై ఆరా తీయలేదు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు పాఠశాలకు చేరుకొని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంజేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకపోవడంతోనే అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోపించారు. ఆర్నెళ్లుగా గుడ్లు, పల్లిపట్టీలు ఇవ్వడం లేదని తెలిపారు. నీళ్ల పప్పు, ప్రతీరోజు ఉదయం కిచిడి మాత్రమే పెడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా వార్డెన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ఆర్‌సీవో గంగాధర్, ప్రిన్సిపాల్ ఉపేందర్‌ను నిలదీశారు. జీసీసీ, కాంట్రాక్టర్లు సరుకులు సరఫరా చేయకుంటే ఉన్నతాధికారులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. విద్యార్థినుల అస్వస్థతకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్‌సీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఆస్పత్రికి విద్యార్థినిని తీసుకువచ్చిన పాఠశాల సిబ్బంది

వైద్యశిబిరం ఏర్పాటు చేస్తాం

పాఠశాలలో చాలామంది విద్యార్థుల్లో రక్తహీనత, క్యాల్షియం, న్యూట్రీషన్ తక్కువగా ఉంది. విద్యార్థులు బలహీనంగా ఉన్నారు. వాతావరణంలో వచ్చిన మార్పు కూడా తోడవడంతో విద్యార్థినుల్లో శ్వాస సమస్య వచ్చింది. కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలో వారంపాటు ప్రత్యేక వైద్యనిపుణులతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తాం. ఉన్నతాధికారులతో మాట్లాడి అన్ని చర్యలు తీసుకుంటాం. స్థానిక ఆస్పత్రిలో ఆక్సిజన్ కొరత లేకుండా చూస్తాం. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– రాథోడ్ నరేందర్, డీఎంహెచ్‌వో

కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆరా

మండల కేంద్రంలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాల పరిస్థితి, విద్యార్థినుల ఆరోగ్యంపై కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ఆరా తీశారు. విద్యార్థినుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, ఘటనపై నివేదిక అందించాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ఆర్‌సీవో గంగాధర్‌ను ఆదేశించారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని, పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాలతో పాఠశాలను సందర్శించిన అధికారులు విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా తీశారు. అస్వస్థతకు కారణాలు పరిశీలించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, ప్రతీరోజు ఉదయం కిచిడి మాత్రమే పెడుతున్నారని, ఉదయం స్నాక్స్ ఇవ్వడం లేదని విద్యార్థులు తెలిపారు. వెంటనే వైద్యశిబిరం ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

పచ్చని చెట్లు నేలమట్టం..!



కూల్చివేసిన చెట్టు

భైంసాటౌన్: జిల్లాలో బోధన్–భైంసా 161 బీబీ రాష్ట్రీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు భైంసా నుంచి బాసర వరకు పనులు చేపడుతున్నారు. కాగా, రహదారి విస్తరణ పనులతో పచ్చని చెట్లు నేలమట్టమవుతున్నాయి. భైంసా–బాసర మార్గంలో రోడ్డుకిరువైపులా పెరిగిన వృక్షాలను తొలగిస్తున్నారు. వీటి తొలగింపునకుగాను గుత్తేదారు నుంచి ఒక్కో చెట్టుకు రూ.550 చలానా వసూలు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. తొలగించిన చెట్ల స్థానంలో రహదారి పనులు పూర్తయిన అనంతరం మొక్కలు నాటాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లేనిపక్షంలో చెల్లించిన మొత్తం రీయింబర్స్ కాదని పేర్కొన్నారు. కాగా, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారీతిన చెట్లు తొలగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బోనమెత్తిన పీచర



బోనాలతో వస్తున్న మహిళలు

లక్ష్మణచాంద: పీచర గ్రామంలో మహిళలు పోచమ్మ, పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఇటీవల నూతన పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. శనివారం ఉదయం పోచమ్మకు, సాయంత్రం పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. సర్పంచ్ లత, ఎంపీటీసీ రాజేశ్వర్, ఉప సర్పంచ్ ముత్తన్న ఉన్నారు.

సంప్రదాయాలు కాపాడుకోవాలి



మాట్లాడుతున్న గోడం నగేశ్

ఇంద్రవెల్లి: సంస్కృతీసంప్రదాయాలను కాపాడుతూనే భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఆదివాసీలందరిపై ఉందని మాజీ ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కేస్లాపూర్ గ్రామపంచాయతీ పరిధి కేస్లాగూడ గ్రామంలో హెరేకుమ్ర వంశానికి చెందినవారు కొత్తగా నిర్మించిన పెర్సపేన్ ఆలయ ప్రారంభోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయాన్ని ప్రారంభించారు. అతిథులను హెరేకుమ్ర వంశీ యులు శాలువాలతో సన్మానించారు. అనంతరం నగేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహించడానికి, ఆలయాలు నిర్మించడానికి నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, నాయకులు కనక తుకారాం, కనక హనుమంత్‌రావ్, కోరెంగా సుంగు, ఆదివాసీ పెద్దలు రామారావ్, యశ్వంత్‌రావ్, సుంకట్‌రావ్, వినాయక్‌రావ్ ఉన్నారు.

కీచక గురువు

- విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన
- సస్పెండ్ చేసిన కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో కోచ్ రవీందర్ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. కొద్దిరోజులుగా వేధింపులు, వెకిలి చేష్టలకు పాల్పడుతుండగా తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఈ విషయాన్ని శుక్రవారం తెలిపినట్లు పేర్కొన్నారు. దీంతో ఆమె శనివారం సంబంధిత హెచ్ఎం, ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ నలుగురు అధికారులతో విచారణ చేపట్టి ఉన్నతాధికారికి నివేదిక అందజేశారు. ఆ నివేదిక ఆధారంగా కీచక గురువు రవీందర్‌పై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కాగా, ఆటలు ఆడించే ఆ గురువు వాట్సాప్‌లో 'నువ్వంటే ఇష్టం.. ఎందుకు నన్ను పట్టించుకోవడం లేదు' అనే రీతిలో తనకు పెట్టిన మెస్సేజ్‌ను బాధిత విద్యార్థిని అధికారులకు చూపించినట్లు తెలిసింది. క్రీడల్లో విద్యార్థులను ఉన్నతస్థాయికి తీసుకెళ్లాల్సిన ఆ కీచక గురువు గతంలోనూ కొందరు విద్యార్థినులతో ఇలాగే ప్రవర్తిస్తుండేవాడని పాఠశాల విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా విద్యార్థినులతో ఇంటి పనులు చేయించుకోవడం, తన పిల్లల్ని ఆడించడం లాంటి పనులు చెప్పేవాడని తెలిపారు. తమ భవిష్యత్ ఇబ్బందుల్లో పడుతుందన్న భయంతో ఇప్పటివరకు ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదని బాధిత విద్యార్థినులు ఆవేదన వ్యక్తంజేశారు.

కీచక గురువుకే అధికారుల వత్తాసు..!

స్పోర్ట్ స్కూల్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన రవీందర్ కొన్నేళ్లుగా కోచ్‌గా పని చేస్తున్నాడు. కాగా, ఆ పాఠశాల ఉన్నతాధికారి అండదండలతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. విద్యార్థినులతో ఇంటి పనులు చేయించుకుంటున్నప్పటికీ ఉన్నతాధికారి పట్టించుకోకపోవడం.. ఆయనకే ఇతర పాఠశాలలకు సంబంధించి బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పలుసార్లు విద్యార్థినులు ఫిర్యాదు చేసినా అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జరిగిన ఘటనపై ఆ అధికారిని ఫోన్‌లో వివరణ కోరగా.. 'మా పాఠశాలలో అలాంటివేమీ జరగలేదు. మీకు ఎవరో తప్పుడు సమాచారం ఇస్తున్నారు' అని బదులిచ్చారు. ఆ తర్వాత 'కొద్దిసేపటి క్రితమే ఈ విషయం ప్రిన్సిపాల్ నా దృష్టికి తీసుకువచ్చారు. విచారణ జరిపించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా' అని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా, కేర్ టేకర్ తన దృష్టికి తీసుకురాగా, ఇద్దరు విద్యార్థినులను పిలిచి జరిగిన ఘటన గురించి తెలుసుకున్నట్లు తెలిపారు. నలుగురితో విచారణ జరిపించి ఉన్నతాధికారికి నివేదిక ఇస్తానని పేర్కొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ కోచ్ రవీందర్ సస్పెన్షన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని క్రీడాపాఠశాలలో అథ్లెటిక్స్ కోచ్‌గా వ్యవహరిస్తున్న రవీందర్‌ను కలెక్టర్ రాహుల్‌రాజ్ సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రవీందర్ ఆ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులను లైంగికంగా వేధిస్తుండగా బాధితులు శనివారం ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ డీవైఎస్వో దృష్టికి తీసుకెళ్లగా, నలుగురు కమిటీ సభ్యులతో విచారణ చేపట్టారు. ఆ నివేదికను కలెక్టర్‌కు అందించారు. ఈ మేరకు కలెక్టర్ కోచ్‌ను సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీవైఎస్‌వో) 'సాక్షి'కి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

సారంగాపూర్: పెండల్‌ధరి గ్రామానికి చెందిన తొడసం వాసుదేవ్ (27) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాసుదేవ్ మూడేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. శనివారం తన పంటపొలానికి వెళ్లగా అక్కడ కనిపించిన పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకోగా గమనించిన కుటుంబీకులు నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

భైంసాటౌన్: పట్టణంలోని బీసీ బాలురు వసతిగృహంలో ఓ ఇంటర్ విద్యార్థి శనివారం ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. ముథోల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి భైంసాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో డబ్బుల విషయమై తండ్రి మందలించినట్లు తెలిసింది. మనస్తాపం చెంది హాస్టల్ పైకి వెళ్లి పురుగుల మందు (గుళికలు) తిని ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. తోటి విద్యార్థులు గమనించి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. స్థానిక ఏరియాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి దుర్మరణం

తానూరు: ఈతకు వెళ్లి బావిలో మునిగి యువకుడు మృతి చెందాడు. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మహ్మద్ జీయా (30) రెండు రోజుల క్రితం తానూరులోని అత్తగారి ఇంటికి వచ్చాడు. శనివారం స్థానికులతో కలిసి ధర్మాబాద్ రోడ్డులో ఉన్న వ్యవసాయ బావికి ఈత నేర్చుకోవడానికి వెళ్లాడు. ట్యూబ్ సాయంతో ఈత కొడుతుండగా అది జారిపోయి బావిలో మునిగి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా పాండ్రకొడ తాలుకా చిన్నొర్లిలో నివాసముంటున్న అడెల్లు (40) ఈనెల 17న పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శుక్రవారం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడు కొద్దిరోజులుగా తాగుడుకు బానిసై ఎలాంటి పనులు చేయడం లేదు. మద్యం మత్తులో పురుగుల మందు తాగినట్లు కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని ఆలూర్ బైపాస్ రోడ్డులో శుక్రవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం అవర్గ గ్రామానికి చెందిన ఎర్రోజు శ్రావణ్‌కుమార్ (31) మృతి చెందాడు. శ్రావణ్‌కుమార్ ఆర్మూర్‌లో పనులు ముగించుకొని తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా బైపాస్ మూలమలుపు వద్ద గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు తెలిపారు.



కంపుకొడుతున్న 'కంచెరోని'

నిర్మల్ నడి బొడ్డునున్న కంచెరోని చెరువు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి కంపు కొడుతోంది. ఈ మార్గం గుండా వెళ్లే వాహనదారులు, స్థానికులు దుర్గంధం భరించలేకపోతున్నారు. పాలకులు, అధికారులు పట్టించుకొని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్